# అమ్మ ఎవరికైనా అమ్మే!

'శ్రీనివాసరావుగారూ! నా పరిస్థితి అర్థం చేసుకోండి. మీరు చేస్తున్న సాయానికి ఖరీదు కట్టడం కాదుగానీ అంతకుమించి ఇచ్చే స్తోమత నాకు లేదు. దయవుంచి కనికరించండి' ప్రాధేయపడ్డాడు భార్గవ్.

శ్రీనివాసరావు మౌనంగా ఉన్నాడేగానీ ఏమీ మాట్లాడలేదు.

అంతవరకూ ఏడుస్తూ కూర్చున్న భార్గవ్ భార్య అఖిల శ్రీనివాసరావుని సమీపించి సార్! అత్తగారే అయినా ఆమె నన్నెప్పుడూ కన్న కూతురిలాగా చూసుకునేది. కనీసం మా పిల్లల ముఖం చూసైనా మా అత్తయ్యగారిని బ్రతికించండి' ఆ మాటలంటున్నపుడు దుఃఖంతో అఖిల ముఖం కన్నీళ్ల సముద్రం అయింది.

శ్రీనివాసరావుకి కోపం వచ్చింది.

'చూడండి... ఈ మాటలన్నీ ఎందుకు? మీరు లక్షరూపాయలు సమకూర్చుకోగలిగితే నాకు కబురుచేయండి' అంటూ మరో మాటకు అవకాశం లేకుండా వెళ్లిపోయాడు శ్రీనివాసరావు.

భార్గవ్ శ్రీనివాసరావు వెళ్లినవైపే చూస్తూండపోయాడు. తన అంచనాలన్నీ తారుమారు కావడంతో అయోమయంలో పడిపోయాడు.

శ్రీనివాసరావుని ఎలాగైనా ఒప్పించి తన తల్లిని కాపాడుకోగలనని భావించాడతను. కానీ ఏమైంది? తన పరిస్థితిని అతడేమాత్రం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడంలేదు. లక్ష రూపాయలు కాదు... తల్లికోసం ప్రాణాలైనా ఇవ్వడానికి తను సిద్ధమే.

డాక్టరుగారు పదిరోజుల క్రితమే చెప్పారు. 'మీ అమ్మగారికి కిడ్నీలు పూర్తిగా చెడిపోయాయి. అర్జంటుగా కిడ్నీ మారిస్తేగానీ బ్రతకరు' అని.

ఎన్నో కష్టాలు పడి భార్గవ్ బి.కామ్. వరకూ చదివించేసరికి అతని తల్లి ఓపిక అయిపోయింది. ఒక మంచి ప్రైవేట్ కంపెనీలో అక్కౌంటెంట్‌గా ఉద్యోగం సంపాదించుకున్నాడు.

అంతలో పెళ్లి... పిల్లలు... నెలకు రెండు వేల జీతం, పార్ట్‌టైమ్‌గా బట్టలషాపులో అక్కౌంట్స్ చేయడం వల్ల వెయ్యిరూపాయలు... మొత్తం మూడువేల రూపాయలతో గుట్టుగా సంసారాన్ని ఈడ్చుకురావాలంటే తలప్రాణం తోకకు వస్తోంది.

తన పెళ్లికి అత్తగారు ఇచ్చిన డబ్బు యాభై వేలు బ్యాంకులో వేసాడు. అది ఇపుడు వడ్డీతో కలిపి డెబ్బైవేల రూపాయలు వస్తాయి. ఆ డబ్బు మొత్తం బ్యాంకు నుంచి డ్రా చేసి శ్రీనివాస రావుకి ఇద్దామనుకున్నాడు భార్గవ్. శ్రీనివాస రావు లక్షరూపాయలు అడుగుతున్నాడు. మిగతా ముప్పైవేల రూపాయలు ఎక్కడి నుంచి తేవాలో అర్ధంకాక ఆలోచనలో పడ్డాడు భార్గవ్.

తన ఫ్రెండ్ ద్వారా శ్రీనివాసరావు పరిచయమయ్యాడు. కానీ లక్షకు ఒక్క రూపాయి తగ్గినా తీసుకోనంటున్నాడు. ఏంచేయాలో అర్ధంకాక తలపట్టుకు కూర్చున్నాడు భార్గవ్.

రెండు రోజుల్లో ఆపరేషన్ చేయకపోతే మీ అమ్మగారు బ్రతకడం కష్టం అని డాక్టర్ చెప్పాడు. రెండు రోజులూ గడిచిపోయాయి.

గబగబా హాస్పటల్ నుంచి బయటకు



కొప్పరపు నాగేశ్వరరావు




వచ్చాడు భార్గవ్. ఇప్పుడు శ్రీనివాసరావు తప్ప తన తల్లిని మరెవ్వరూ కాపాడలేరు. అతనినే మరోసారి ప్రాధేయపడదామని ఆలోచిస్తూ వడి వడిగా అడుగులు వేస్తూ శ్రీనివాసరావు ఇంటికి చేరుకున్నాడు భార్గవ్.

శ్రీనివాసరావు ఇంట్లో అందరూ ఏడుస్తున్నారు. భార్గవ్‌కి విషయం అర్థంకాలేదు.

భార్గవ్‌ని చూడగానే శ్రీనివాసరావు 'భార్గవ్ గారూ! మిమ్మల్ని డబ్బు కోసం నేనంత గట్టిగా అడిగింది మా అమ్మగారి కోసమే. మా అమ్మగార్కి మీరిచ్చే లక్షరూపాయలతో గుండె ఆపరేషన్ చేయించి బ్రతికించుకుందామనుకున్నాను. ఇప్పుడు ఇలా జరిగింది' – అంటూ వెక్కివెక్కి ఏడవసాగాడు శ్రీనివాసరావు.

'శ్రీనివాసరావుని తాను తప్పుగా ఊహించుకున్నాని అప్పుడు తెలిసింది భార్గవ్‌కి. అతనిని డబ్బు మనిషిగా భావించాడు. తన తల్లి ప్రాణం తన కెంత ముఖ్యమో అతని తల్లి ప్రాణం అతనికీ అంతే కదా! ఎంతసేపూ తనవైపు నుంచే సమస్యని చూసాడుగాని, అతని అవసరమేమిటో తెలుసుకోలేకపోయాడు'.

'ఎలాగూ మా అమ్మగారిని దక్కించుకోలేకపోయాను. ఉన్న మీ అమ్మగారినన్నా రక్షించుకుందాం రండి హాస్పటల్‌కి. నా కిడ్నీ ఉచితంగానే మీ అమ్మగార్కి ఇస్తాను' అన్నాడు శ్రీనివాసరావు.

భార్గవ్‌కి నోటమాట రాలేదు.

'శ్రీనివాసరావుగారూ! ముందు జరగాల్సిన పనులు చూడండి. తర్వాత హాస్పటల్‌కి వెళదాం' అన్నాడు భార్గవ్.

'లేదండీ! లేటైతే మీ అమ్మగారి ప్రాణాలకీ ముప్పు రావచ్చు. అర్జంట్ అని చెబుతూనే ఉన్నారు కదా! త్వరగా హాస్పటల్‌కి వెళదాం' అంటూ బయల్దేరాడు శ్రీనివాసరావు.

'దేవుడు ఉన్నాడో లేడో తెలియదుగానీ ఈ శ్రీనివాసరావు నిజంగా శ్రీనివాసుడే' అనుకుంటూ అతనిని అనుసరించాడు భార్గవ్. ●